క్లుప్తంగా

ముక్కంటి సేవలో..

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని మంగళవారం రాష్ట్ర కాపు సంఘం నాయకుడు ఆకుల రామకృష్ణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి, జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

విరివిగా పనులు కల్పించాలి

ఏర్పేడు: ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డుదారులకు విరివిగా పనులు కల్పించాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని కోబాకలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో 150 మంది కూలీలకు తగ్గకుండా పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాబ్ కార్డున్న ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతుల పొలాల్లో పండ్లు, పూల తోటల పెంపకం చేపట్టాలని సూచించారు. అమృత్ సరోవర్‌తో భూగర్భ జలాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. కూలీలకు ప్రతి రోజు రూ.272 వేతనం వచ్చేలా కొలతలు ఇవ్వాలని చెప్పారు. ఏపీఓ దేవరి, జేఈ బాలాజీరావు, సాంకేతిక సహాయకుడు మనోహర్, పాల్గొన్నారు.

కార్యాలయంలో 6 అడుగుల పాము



బుచ్చినాయుడుకండ్రిగ: తహసీల్దారు కార్యాలయంలోకి మంగళవారం ఆరు అడుగులు జెర్రిపోతు వచ్చింది. కార్యాలయ సిబ్బంది భయపడి, పాముల పట్టే చెంచయ్యకు సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి పామును పట్టి, అడవిలో వదిలి వేశారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం

నారాయణవనం: మండలంలోని కీళగరం దళిత వాడలో హెచ్ఐవీపై మంగళవారం సంస్కృతి కళా సంస్థ, స్టెప్స్ సంస్థ సంయుక్తంగా అవగాహన కల్పించాయి. హెచ్ఐవీ సోకే విధానం, రోగ లక్షణాలను, ఆరోగ్యంపై చూపే ప్రభావాలను కళాబృందం నాటక, పాటల రూపంలో ప్రదర్శించారు. సంస్థల ప్రతినిధులు రెడెప్ప, ఆర్ముగం, కళాజాత బృంద సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు గదుల పరిశీలన

సత్యవేడు: రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ఈవీఎంలు, మెటీరియల్ భద్రపరిచేందుకు అనువైన స్థలాలను ఆర్‌ఓ కేవీ నరసింహులు పరిశీలించారు. మంగళవారం తహసీల్దార్ కె. రామాంజనేయులుతో కలిసి బాలికల గురుకుల పాఠశాల, పాలి టెక్నిక్ కళాశాలలో గదులను పరిశీలించారు. ఎన్నికల మెటీరియల్ పంపిణీ చేసేందుకు బాలికల గురుకుల పాఠశాలను, స్ట్రాంగ్ రూం ఏర్పాటుకు పాలిటెక్నిక్ కళాశాల గదులను ఎంపిక చేశారు. డీటీ రవిచంద్ర, ఎంఈఓ కె.రవి, ఆర్ఐ ఏ.కిరణ్ కుమార్, సుధా తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు, పీవీకండ్రిగ, భవానీశంకరాపురం, పుత్తేరి, కనమనంబేడు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను మంగళవారం తహసీల్దార్ పఠాన్ మహ్మద్ ఆలీఖాన్, డిప్యూటీ తహసీల్దారు చంద్రబాబునాయుడు పరిశీలించారు. వారు మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికలను పురస్కరించుకుని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలించినట్లు తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా సేవలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలు అందించాలని అధికారులకు దేవస్థానం ఈవో ఎస్వీ నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం ఆలయంలోని పలు విభాగాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశా రు. రూ.500, రూ.1,500 రాహుకేతు పూజా మండపాలను పరిశీలించారు. అక్కడ భక్తులతో మాట్లాడారు. లోటుపాట్లు ఉంటే తమదృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రసాదాల తయారీ నాణ్యతను పరిశీలించారు. ప్రమాణాలు పాటించాలని సూచించారు.

సిపాయి భరోసా అందజేత



శ్రీకాళహస్తి : మండలంలోని టీఎంవీకండ్రిగలో మేళాగారం పాంచాలమ్మ కుటుంబానికి మంగళవారం సిపాయి భరోసా అందజేశారు. ఇటీవల పాంచాలమ్మ మృతి చెందారు. ఆమె కుటుంబ పరిస్థితులను తెలుసుకుని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మంగళవారం ఆ గ్రామానికి వెళ్లి తన ఆధ్వర్యంలో నడుస్తున్న సిపాయి భరోసా కింద ఏడాదికి సరిపడే నిత్యావసర సరుకులు అందజేశారు.



ఊరందూరులో ప్రచారం నిర్వహిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి



బుక్‌లెట్‌లు అందిస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

మూడు దశాబ్దాల అభివృద్ధి

- నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలోనే మాజీ మంత్రి స్వగ్రామం అభివృద్ధి
- పథకాలతో ఇంటింటికీ రూ.లక్షల్లో లబ్ధి
- ప్రచారంలో బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి : మూడు దశాబ్దాల పాలనలో బొజ్జల కుటుంబం తమ స్వగ్రామమైన ఊరందూరులో పురాతన ఆలయాలనైనా అభివృద్ధి చేసుకోగలిగిందా అని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె, వైఎస్సార్ సీపీ నాయకురాలు బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. సిద్ధం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఊరందూరులో మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశాబ్దాలుగా పురాతన నీలకంఠేశ్వరాలయం అభివృద్ధికి నోచుకోకపోవడంతో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చొరవతో రూ.50 లక్షలు వెచ్చించి అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. ఊరందూరు ప్రభుత్వ పాఠశాలను నాడు–నేడు కింద అన్ని వసతులు కల్పించి రూపురేఖలు మార్చినట్లు తెలిపారు. ప్రజల మధ్యన ఉంటూ ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషిచేసేవారే నిజమైన నాయకులని చెప్పారు. కరోనా కష్టకాలంలో టీడీపీ నాయకులు ఎక్కడో హైదరాబాదులో తలదాచుకుంటే ప్రజలకు అండగా నిలిచి ప్రజలకు నిత్యావసర సరుకులు, మెడికల్ కిట్లు అందించిన వ్యక్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాత్రమేనని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ పాలనలో ప్రభుత్వ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి రూ.3నుంచి 4 లక్షల లబ్ధి అందిందని తెలిపారు. అర్హతే ప్రమాణికంగా పథకాలు ఇంటి ముంగిటకే అందుతున్నాయన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 30ఏళ్ల అభివృద్ధిని నాలుగున్నర ఏళ్లలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేసి చూపించారని పేర్కొన్నారు. ఇలాంటి పాలన కోసం మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే గ్రామీణాభివృద్ధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం వచ్చిందని, సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రజల ముంగిటకే పాలన వచ్చిందని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీవాణిరెడ్డి అన్నారు. సిద్ధం కార్యక్రమంలో భాగంగా తొట్టంబేడు మండలం తాటిపర్తి, మల్లిగుంట, కల్లిపూడి గ్రామాల్లో మంగళవారం ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న ఇచ్చిన హామీల్లో 99శాతం పరిష్కరించినట్లు చెప్పారు. నవరత్నాలు పథకాల కింద ప్రతి ఇంటికీ రూ.లక్షల్లో లబ్ధి చేకూరిందని తెలిపారు. తాటిపర్తి, కల్లిపూడి పరిసర గ్రామాలకు 8.25 కిలోమీటర్ల మేర రూ.5కోట్లు నిధులను వెచ్చించి రింగ్‌రోడ్డును నిర్మించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలోనూ ప్రజల మధ్యనే ఉంటూ సొంత నిధులు రూ.కోట్లు సాయం చేశారని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో ప్రజల ముందుకు వచ్చి ఓట్లడిగేవారిని ఆదరిస్తే, మళ్లీ ఎన్నికలు వస్తే కానీ ప్రజలు కనిపించరని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఉన్నం వాసుదేవనాయుడు, సర్పంచ్ నాగేంద్ర, ఎంపీటీసీ సభ్యురాలు చెంచుమహాలక్ష్మి, వైస్ ఎంపీపీ గెరటూరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మణినాయుడు, నాయకులు శోభన్‌నాయుడు, మునిరాజారెడ్డి, పెరుమాళ్‌రెడ్డి శేఖర్‌రెడ్డి, మురళీరెడ్డి, బాలప్రసాద్, లోకయ్య, దాము, సుబ్రమణ్యం, చెంచురామిరెడ్డి, కోవి చంద్రయ్యనాయుడు, గంగాధరం, చంద్రబాబు, సునీత, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భీష్మ ఏకాదశి వేడుకలు



తిరువీధుల్లో విహరిస్తున్న జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి, శ్రీవల్లీ, దేవసేన సమేత కుమారస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో భీష్మ ఏకాదశి వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలోని అలంకార మండపంలో శ్రీజ్ఞానప్ర సూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి ఉత్సవమూర్తులకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రాలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి,అమ్మవార్లను చప్పరాలపై అధిష్ఠింపజేసి మాడ వీధుల గుండా సుబ్రమణ్యస్వామి కొండ(విజ్ఞానగిరి) వద్దకు వేంచేపు చేశారు. అక్కడ స్వామి అమ్మవార్లకు భీష్మ ఏకాదశి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణవనంలో...

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధలోని ప్రసిద్ధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజా కైంకర్యాలను చేపట్టారు. ఏకాదశి గడియల్లో అర్చనలు చేశారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. తదుపరి ఉత్సవమూర్తులను తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి నైవేద్య సమర్పణం చేశారు. ఆలయ ఆర్జితం అధికారి భరత్, భద్రతా జమేదార్ రమణలు పర్యవేక్షించారు.



నారాయణవనం: ఊరేగింపులో స్వామి,అమ్మవార్లు

అంబరాన్నంటేలా మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ నాగేశ్వరరావు

- 3 నుంచి బ్రహ్మోత్సవాలు
- భక్తులకు సకల ఏర్పాట్లు
- ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను అందరి సమన్వయంతో అత్యంత వైభవంగా నిర్వహిస్తామని దేవస్థానం ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు అన్నారు. మార్చి 3వ తేదీ నుంచి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆలయ పరిపాలన భవనంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించే భాగ్యం తనకు కలిగినందుకు ఆనందంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావే శం నిర్వహిస్తామని తెలిపారు. స్థానికులు, మీడి యా సూచనలు కూడా తీసుకుంటామన్నారు. బుధవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా బ్రహ్మోత్సవ ఆహ్వాన వాల్ పోస్టర్లను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఆలయం, నాలుగు మాడ వీధుల్లో పారిశుద్ధ్య నిర్వహణ, క్యూల పర్యవేక్షణకు మున్సిపల్, ఆలయం తరఫున కొంతమందిని కేటాయించనున్నట్లు వెల్లడించారు. ఆలయ పైభాగంలో మార్గం ఏర్పాటు చేసి కన్నప్ప ఆలయం పక్క నుంచి భక్తులు బయటకు వెళ్లేలా దారి ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్నామన్నారు. మూడవ గోపురం నుంచి వీఐపీలు ఆలయంలోకి వెళ్లే విధంగా, వీవీఐపీలు నాలుగవ గేటు నుంచి లోపలకు వెళ్లేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ధూర్జటి కళా ప్రాంగణాన్ని మార్చి, అక్కడ వీఐపీల వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయాలని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు తిరుమంజనం గోపురం వద్ద మెట్లు అసౌకర్యంగా ఉన్నా యని భక్తులకు సౌకర్యంగా చెక్క మెట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విలేకరులు అడిగిన ప్రశ్న కు ఎమ్మెల్యే, కలెక్టర్‌తో చర్చించి సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఏసీ కృష్ణారెడ్డి, మల్లి కార్జునప్రసాద్, ఈఈ నూకరత్నం, సూపరింటెండెంట్ శ్రీహరి, ఏఈవో లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ గురుమూర్తి పర్యటన

వరదయ్యపాళెం: తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ బుధవారం వరదయ్యపాళెం మండలంలో పర్యటించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే వలంటీర్లకు వందనం కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులు విచ్చేసి పురస్కారాలు అందజేస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

చట్టాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వరరావు

శ్రీకాళహస్తి: జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు పట్టణంలోని ఉప కారాగారంలో ఖైదీలకు చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయవాది రాజేశ్వరరావు మాట్లాడుతూ చట్టం అందరికీ సమానమేనన్నారు. న్యాయవాదులు గరికపాటి రమేష్‌బాబు, శ్రీరామ్, పారా లీగల్ వాలంటీర్లు సాయిరాం, లీగల్ ఎయిడ్ సిబ్బంది, జైలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతకు సముచిత స్థానం

- ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా మిద్దెల హరి

రేణిగుంట/శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఆప్కో మాజీ డైరెక్టర్ మిద్దెల హరి నిబద్ధతను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్‌గా ఆయనను నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. బీసీ సామాజిక వర్గానికి చెందిన మిద్దెలహరి పార్టీ ఆవిర్భావం నుంచి శ్రీకాళహస్తి పట్టణంలో పార్టీ బలోపేతానికి కృషి చేశారు. వార్డుల్లో పార్టీ కేడర్‌ను బలపరచడంలో కీలకంగా వ్యవహరించారు. గత ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ తరఫున మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరించి ప్రజా సమస్యలపై పోరాడారు. ఆప్కో డైరెక్టర్‌గా జిల్లాలో చేనేత కార్మికుల అభ్యున్నతికి కృషి చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. ఆయన పార్టీకి చేసిన సేవలకు సముచిత స్థానం కల్పించాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఆర్టీసీ వైస్ చైర్మన్ పదవి వరించడంలో కీలకంగా వ్యవహరించారు. దీంతో ఆయన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డితో కలసి విజయవాడకు వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. తాను శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఆయనకు ఆర్టీసీ వైస్ చైర్మన్ రావడం పట్ల శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు, పద్మశాలి నేత కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మిద్దెల హరి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

దేశానికే ఆదర్శం వలంటీర్ వ్యవస్థ



సత్యవేడు: సేవారత్న అవార్డులు అందుకున్న వలంటీర్లు

సత్యవేడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మంగా తీసుకువచ్చిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎంపీపీ వి.ప్రతిమ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు పి.విజయలక్ష్మి పాల్గొన్నారు. మండలంలోని 17 సచివాలయాల పరిధిలో సేవారత్నకు ఎంపికైన పి.మీనా(కన్నావరం), ఆర్.యోగేందర్(సత్యవేడు 2), కె. చందు(రాజగోపాలపురం), హరిప్రియ(సత్యవేడు4), ఎం.గాయత్రి(మదనంబేడు)కు రూ.30వేలు నగదు ప్రోత్సాహకాలను. సేవామిత్రకు ఎంపికైన 271 మందికి రూ.15 వేలు ప్రోత్సాహక బహుమతి అందజేసి సత్కరించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ వలంటీర్ల ద్వారా పథకాల లబ్ధి ఇంటి ముంగిటే అందుతున్నట్లు తెలిపారు. ఓర్వలేకే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె. సుశీల్ కుమార్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కె.చంద్రశేఖర్ రెడ్డి, సురుటుపల్లె ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, వ్యవసాయ కమిటీ చైర్మన్ కె.శ్యాంప్రసాద్ రెడ్డి, మార్కెటింగ్ కమిటీ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.



బీఎన్‌కండ్రిగ : సన్మానం అందుకున్న వలంటీర్

సేవా సారథులు వలంటీర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వలంటీర్లు సేవా సారథులని కాటూరు ఎంపీటీసీ సభ్యుడు నెలటూరు రవి తెలిపారు. మంగళవారం కాటూరు సచివాలయంలో వలంటీర్లకు సేవా మిత్ర పుర స్కారాలను అందించి, సత్కరించారు. ఆయన మాట్లాడుతూ పథకాల ఫలాలను నేరుగా లబ్ధిదారుల ఇళ్లకే చేర్చే వలంటీర్ వ్యవస్థ దేశంలో మరే రాష్ట్రంలో లేదన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన



పిచ్చాటూరు: రామగిరిలో ఆరోగ్యశ్రీ కార్డు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పిచ్చాటూరు: మండలంలోని రామగిరి సచివాలయంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష –2 వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో చిన్నపిల్లల స్పెషలిస్ట్ డాక్టర్ పూజిత, పీహెచ్‌సీ డాక్టర్లు హమీద్, మునిచరిత్ర 312 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 30 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 22 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. సర్పంచ్ సతీష్, ఏఓ రాధారాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కె.వెంకటచలపతిరాజు, ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు రమేష్ రాజు, రామగిరి ఆలయ చైర్మన్ వెంకటేశులు, నాయకులు అర్ముగం రెడ్డి, సూరిబాబు రెడ్డి, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం

ఏర్పేడు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు మెరుగైన వైద్యం అందుతోందని పాపానాయుడుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి నాగరాజు అన్నారు. మంగళవారం మండలంలోని కందాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని కందాడు, ఎలకమిట్ట, ఎస్సీ, ఎస్టీ కాలనీల నుంచి వచ్చిన 327 మందికి బీపీ, షుగర్, గళ్ల, రక్త తదితర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి మధురిమ, మాజీ సర్పంచ్ వీరరాఘవరెడ్డి, పారి నాగరాజు, కమలాకర్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి : మండలం ముచ్చివోలులో మంగళవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి విచ్చేసిన గ్రామీణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి, చెర్లోపల్లి సచివాలయ కన్వీనర్ వెంకటేష్ నాయుడు, నాయకులు మనోహర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, గురునాథరెడ్డి, పనపాక వెంకటేశ్వర్‌రావు, పసల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని చిన్నారి మృతి

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం స్వర్ణముఖీ నది సమీపంలోని ఇటుక బట్టీలో పనిచేస్తున్న వలస కార్మికుల కుమార్తె చిన్నారి బాలిక మంగళవారం ట్రాక్టర్ ఢీకొని మృతి చెందింది. గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి కథనం మేరకు.. ఒడిషా రాష్ట్రానికి చెందిన వికాస్, సబిత స్థానికంగా ఇటుక బట్టీలో వలస కార్మికులుగా పని చేస్తున్నారు. వారి కుమార్తె చాందిని(05) ఇటుక బట్టీ సమీపంలో ఆడుకుంటుండగా, ఇటుక లోడ్ కోసం వచ్చిన ఓ ట్రాక్టర్ ప్రమాదవశాత్తూ బాలికను ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలికకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. చిన్నారి అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ వైద్య కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బర్డ్‌ఫ్లూ లేదు..ఆందోళన వద్దు





వేడాం గ్రామంలో కోళ్ల ఫారంను తనిఖీ చేస్తున్న అధికారులు, నారాయణవనం: కొండలచెరువులో అవగాహన

శ్రీకాళహస్తి: మన జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్వీ శ్రీకాంత్‌బాబు తెలిపారు. నెల్లూరు జిల్లాలో బర్డ్‌ఫ్లూ వెలుగుచూడడంతో శ్రీకాళహస్తి పశుసంవర్ధకశాఖ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. పట్టణంలోని వేడాం గ్రామంలోని కోళ్లఫారం, పెరటికోళ్లను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో ఐదు ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను నియమించామన్నారు. ఎక్కడైనా సాధారణ స్థాయికంటే ఎక్కువసంఖ్యలో కోళ్లు మరణించి ఉంటే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. వైద్యులు రవీంద్రవర్మ, సహాయకుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఆర్‌టీ టీమ్‌ల ఏర్పాటు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పెరటి కోళ్లు, పౌల్ట్రీ కోళ్లకు బర్డ్ ఫ్లూ వ్యాధి లక్షణాలు లేవని, అందుచేత బర్డ్ ఫ్లూపై ఎలాంటి ఆందోళన వద్దని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మునిరాజా తెలిపారు. ఆయన మంగళవారం కొత్తకండ్రిగ, వెస్టువరత్తూరు, కాటూరు, కారణిమిట్ట, పల్లమాల గ్రామాల్లో పర్యటించి పెరటి కోళ్ల ఆరోగ్యాన్ని పరిశీలించి, కోళ్లకు ఎలాంటి బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవని తెలిపారు. ఆర్ఆర్‌టీ టీమ్‌ను ఏర్పాటు చేశామని, ఈ టీమ్ బర్డ్‌ఫ్లూ లక్షణాలుంటే గుర్తించి, అప్రమత్తం చేస్తుందని తెలిపారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆదాయం

ఏర్పేడు: కోళ్లలో బర్డ్ ఫ్లూ వ్యాధిపై ఆందోళన చెందాల్సిన పనిలేదని ఏర్పేడు పశు వైద్యాధికారి శిల్పారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మేర్లపాక, కొత్తవీరాపురం గ్రామాల్లో పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో పెరటి కోళ్ల పెంపకాన్ని పరిశీలించారు.

రేణిగుంటలో..

రేణిగుంట: మండలంలోని ఆర్.మల్లవరం, కృష్ణాపురం, విప్పమానుపట్టెడ, గాజులమండ్యంలోని వివిధ పౌల్ట్రీలను, పెరటి కోళ్ల ఫారమ్‌లను మంగళవారం మండల పశువైద్యాధికారిణి శ్రవంతి తనిఖీ చేశారు. ఎక్కడా బర్డ్ ఫ్లూ లక్షణాలు కనబడలేదని ఆమె నిర్ధారించారు.

నారాయణవనంలో..

నారాయణవనం: మండలంలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ లేదని మండల పశువైద్యాధికారులు భార్గవి, కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కీళగరం, ఎరికంబట్టు, కొండలచెరువు, తుంబూరు, నైనారుకండ్రిగ, పాలమంగళంలో మహిళలకు, కోళ్ల పెంపకందార్లతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ మండలంలో వెటర్నరీ అసిస్టెంట్లతో, గోపాలమిత్రలతో పెరటి కోళ్లను, పౌల్ట్రీలను తనిఖీ చేయిస్తున్నామని అన్నారు. ఇప్పటి వరకు బర్డ్‌ఫ్లూ లక్షణాలు ఉన్న కోళ్లను ఎక్కడాకనిపించలేదని తెలిపారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



అ..అక్షర ఆకృతిలో విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు అ...అక్షర ఆకృతిలో తెలుగు భాషాభిమానం చాటుకున్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అనర్థదాయకం



అన్నాసామిపల్లెలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

రేణిగుంట: బాల్య వివాహాలు అనర్థదాయకమని సీడీపీవో కృష్ణమంజరి అన్నారు. పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో మంగళవారం భేటీ పడావో, భేటీ బచావో కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల అనారోగ్య సమస్యలు, మానసిక సమస్యలు తలెత్తుతాయన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అలాగే మండలంలోని అన్నాసామిపల్లె హైస్కూల్లో ఐసీడీఎస్, రాస్, చైల్డ్ ఫండ్ ఇండియా నేతృత్వంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. సూపర్‌వైజర్ హేమావతి,కమ్యూనిటీ మొబలైజర్ వెంకటేష్ పాల్గొన్నారు.